సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం । 19 । అక్టోబర్ । 2025



అన్నవరం దేవస్థానానికి విరాళం

అన్నవరం: గో సంరక్షణ ట్రస్ట్‌కు కె.విజయబాబు దంపతులు (కాకినాడ) రూ.1.50 లక్షలు, నిత్యాన్నదానానికి కేవీ నారాయణశర్మ దంపతులు (హైదరాబాద్) రూ.లక్ష విరాళమిచ్చారు.



తప్పాసులు జాగ్రత్త

మతాబులు మమతలు పూయ.. చిచ్చుబుడ్లు కాంతులనీయ.. తారాజువ్వలు గాలిలో ఎగరేయ.. వెలుగుల పండగను ఆనందాల రవళిలా జరుపుకొందాం.

II లో

1.54 లక్షల క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 1,54,064 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 2,700, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కులు వదిలారు. భద్రాచలం వద్ద 17.90, కాటన్ బ్యారేజ్ వద్ద 10.10 అడుగులకు నీటి మట్టాలు చేరాయి.

న్యూస్‌రీల్

‘చెకుముకి’ పరీక్షలు ప్రారంభం



చెకుముకి పరీక్షలను ప్రారంభిస్తున్న హనుమంతరావు తదితరులు

ముమ్మిడివరం: విద్యార్థులలో శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తి అవగాహన పెంపొందేలా జన విజ్ఞాన వేదిక ఏటా జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తోందని జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బీర హనుమంతరావు పేర్కొన్నారు. ముమ్మిడివరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం చెకుముకి పాఠశాల స్థాయి పరీక్షలను ఆయనతో పాటు జిల్లా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు జనిపెల్ల సత్యనారాయణ, కన్వీనర్ ఎస్.అబ్బులు ప్రారంభించారు. హనుమంతరావు మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపర్చిన శాస్త్ర విజ్ఞాన దృక్పథాన్ని ప్రజల్లోనూ, విద్యార్థులలోనూ పెంపొందించడానికి ఈ వేదిక కృషి చేస్తోందన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మొత్తం 26 యూనిట్ల నుంచి 372 పాఠశాలల్లో మొత్తం 26,850 మంది 8, 9, 10 తరగతి విద్యార్థులు ఈ పరీక్ష రాస్తున్నారన్నారు. మండల స్థాయిలో నవంబరు 1 నుంచి, నవంబరు 23నుంచి జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దు

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: ఆగ్నేయ బంగాళాఖాతం చుట్టూ అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలో మంగళవారం నుంచి చేపల వేటకు వెళ్లవద్దని కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం నుంచి మంగళవారం వరకు దక్షిణ అరేబియా సముద్రం మధ్య భాగంలో, బుధవారం నైరుతి పశ్చిమ–మధ్య అరేబియా సముద్రం అల్లకల్లోలంగా దక్షిణ తమిళనాడు తీరాల వెంబడి ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య అరేబియా సముద్రంలోకి మత్స్యకారులు సముద్రంపై వేటకు వెళ్ల వద్దని సూచించారు. ఇది పశ్చిమ–వాయువ్య దిశగా ప్రయాణించి 48 గంటల్లో దక్షిణ దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ–మధ్య బంగాళాఖాతం మధ్య వాయుగుండంగా మారే అవకాశం ఉందన్నారు.

జిల్లా క్రీడా అభివృద్ధి అధికారిగా వైకుంఠరావు



కలెక్టర్ మహేష్‌కుమార్‌ను కలిసిన డీఎస్‌వో వైకుంఠరావు

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు కొత్తగా డీఎస్‌వోగా వైకుంఠరావు రుద్ర బాధ్యతలు చేపట్టారు. ఆయన కలెక్టర్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జిల్లా క్రీడా అభివృద్ధి అధికారిగా వైకుంఠరావు పదోన్నతి పొందారు. వైకుంఠరావు 2009లో కాకినాడలో బాస్కెట్‌బాల్ కోచ్‌గా తన వృత్తిపరమైన ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆయన అనేక మంది ఆటగాళ్లను జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దారు.

పత్రికా స్వేచ్ఛను హరించడమే



ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా స్వేచ్ఛ భారత రాజ్యాంగం కల్పించింది. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కథనాలు రాస్తున్నారన్న సాకుతో సంపాదకులు, విలేకరులపై కేసు పెట్టి కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరికాదు. పార్టీలు, ప్రభుత్వాలు వేరైనా పత్రికా స్వేచ్ఛను ప్రతి ఒక్కరూ కాపాడాలి. నిజాలు నిర్భయంగా రాసే పత్రికలకు సంపూర్ణ మద్దతు ఉంటుంది. ‘సాక్షి’ దినపత్రిక, ఎడిటర్‌కు నోటీసులు ఇవ్వడం, అక్రమ కేసులు బనాయించడం సరికాదు. ఇది పత్రికా స్వేచ్ఛను హరించడమే. – బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్సీ, అమలాపురం



‘సాక్షి’పై పోలీసు జులుం సరికాదు



కూటమి ప్రభుత్వం ఏది చెబితే అది.. ఎవరి పేరు చెబితే వారిని వేధించడం పోలీసులు మానుకోవాలి. ‘సాక్షి’ పత్రికపై పోలీసు జులుం సరికాదు. ‘సాక్షి’ ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై పోలీసు కేసులు పెట్టి ఇబ్బంది పెట్టడం చూస్తుంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏ వార్త రాసినా ఇలా అక్రమ కేసులతో కక్ష తీర్చుకుంటుందని స్పష్టమవుతోంది. ఇదే కొనసాగితే ఏదో రోజు ప్రభుత్వంతో పాటు పోలీస్ అధికారులు ఇబ్బంది పడక తప్పదు.
– కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్సీ, అమలాపురం

దివ్యాభరణం

- దీపానికి ఆలంబనగా నిలుస్తున్న ప్రమిదలు
- విభిన్న ఆకృతులలో ఆకట్టుకుంటున్న వైనం
- అటు రాజస్థాన్, గుజరాత్..
- ఇటు కర్ణాటక, తమిళనాడు నుంచి దిగుమతి
- విరివిగా కొనుగోలు చేస్తూ ఆదరిస్తున్న ప్రజలు



ఆకాశదీపం ప్రమిదలు



జై జై గణేశా..



ముచ్చటైన మత్స్యాకృతిలో..



ఆకట్టుకునేలా..

మార్కెట్లో వినూత్న ఆకృతులలో ప్రమిదలు



ప్రమిద.. ఒకప్పుడు దీపానికి ఆధారం. పిల్ల తెమ్మెరకు సైతం కొండెక్కే దీపానికి ఏ రక్షణా ఇవ్వలేని నిస్సహాయురాలు. అలాగే ఒకప్పుడు దీపం భగవంతునికి అలంకారంగా నిలిచేది.

కాలం మారింది. రూపం మార్చుకుంది. ఆ దీపం నేడు విభిన్న అలంకారాల నడుమ దేదీప్యంగా వెలుగొందుతోంది. దీపశిఖలో ఏ తొట్రుపాటు లేకుండా ఊర్ధ్వచలనం చేస్తూ తనంత తాను ఘనమయ్యే దాకా ఆలంబనగా, దాని ఆలనా పాలనా చేస్తూ రక్షణగా నిలుస్తున్నాయి ప్రమిదలు. టెర్రాకోటా.. పింగాణి.. పీఓపీ.. ఇలా ఎన్నో రకాల పదార్థాలతో మార్కెట్‌లోకి వస్తున్న ప్రమిదలు ప్రజల మనసులను గెలుచుకుంటున్నాయి.

సాక్షి, అమలాపురం: మట్టి ప్రమిదలలో దీపాలు వెలిగించి దీపావళి జరుపుకోవడం సంప్రదాయం. కాలానుగుణంగా రూపాంతరం చెందుతూ వివిధ ఆకృతులలో తయారు చేస్తున్న ప్ర మిదలు మార్కెట్లను ముంచెత్తుతుంటే ప్రజలు వాటిని విశేషంగా ఆదరిస్తున్నారు. భారతావనిలో ప్రాంతాలకు అతీతంగా వివిధ రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్న ప్రమిద లు ఏటా దీపావళి పండగలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి. ఈ పండగ నాడు దీపాలు వెలిగిస్తే అజ్ఞానాంధకారం తొలగి జగత్తు ప్రకాశవంతంగా వెలుగొందుతుందని ప్రజల విశ్వాసం. అంతేకాదు సాయం సంధ్య వేళ ఇంటి ముందు దీపం పెడితే శ్రీమహాలక్ష్మిని ఆహ్వానించినట్టేనని పెద్దలు చెప్తారు. ఏ మార్పు అయినా గతం కంటే మెరుగైనదే అయి ఉండాలి. అలాగే పాతకాలం నాటి ప్రమిదలలో దీపం చిన్నపాటి గాలికి కూడా కొండెక్కే పరిస్థితి ఉండేది. అలా కొండెక్కడాన్ని కొందరు అపశకునంగా కూడా భావిస్తారు. ఆ పరిస్థితి తలెత్తకుండా నేడు తయారై వస్తున్న ఆధునిక ప్రమిదలు దీపానికి రక్షణగా ఉండే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంటి గూడు, చిన్నపాటి ప్రమిదకు చిమ్నీ ఏర్పాటు, హ్యాంగింగ్ ప్రమిదలు, దీప లక్ష్మిని స్వాగతిస్తున్నట్టు.. రకాలను బట్టి రూ.30 నుంచి రూ.400 వరకు విలువైన ప్రమిదలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.

సరిహద్దులను చెరిపి

వ్యాపారానికి సరిహద్దులు లేవు. స్థానికంగా తయారు చేసి విక్రయించే సంప్రదాయ మట్టి ప్రమిదల స్థానే రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలలో తయారవుతున్న ప్రమిదలు జిల్లాలోని అమలాపురం, మండపేట, రామచంద్రపురం వంటి మున్సిపాలిటీలతో పాటు మారుమూల గ్రామాల్లో కూడా కనిపిస్తున్నాయి. ఇక దక్షిణ భారత రాష్ట్రాలైన కర్ణాటకలోని బెంగళూరు, తమిళనాడు నుంచి కూడా పెద్ద ఎత్తున ప్రమిదలు మార్కెట్‌కు వస్తున్నాయి. జిల్లాలో సుమారుగా 600కు పైగా తాత్కాలిక దుకాణాలు పల్లెలు, పట్టణాల్లో ఏర్పాటు చేసి వీటిని విక్రయిస్తున్నారు.

గతం కంటే తగ్గింది



గతంలో దీపావళి సీజన్‌లో 20 వేల వరకు ప్రమిదలను విక్రయించేవారు. సంప్రదాయ ప్రమిదలపై నేటి తరం ఆసక్తి చూపడం లేదు. నేడు ఐదు వేల ప్రమిదలు కూడా విక్రయించడం లేదు. హోల్‌సేల్‌గా రూ.1.50 నుంచి రూ.2కు విక్రయిస్తున్నారు. బయట మార్కెట్‌లో ఇది రూ.15 నుంచి రూ.20 చేసి విక్రయిస్తున్నారు. తయారీదారులకు ఈ మొత్తం గిట్టుబాటు కావడం లేదు.
– కాపవరపు మల్లేశ్వరరావు, నంగవరం, ఉప్పలగుప్తం మండలం

వెరైటీ ప్రమిదలకు ఆదరణ



దీపావళి పండుగ సందర్భంగా వెరైటీ ప్రమిదల వ్యాపారం చేస్తున్నా. కోనసీమలో కుమ్మరి తయారుచేసే ప్రమిదల కంటే రాజస్థాన్, మధ్యప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే ప్రమిదలకు ఆదరణ పెరిగింది. అమలాపురంలో హోల్‌సేల్ వ్యాపారి వద్ద తెచ్చి వీటిని అమ్ముతున్నాం. ఎక్కువమంది వీటినే కొంటున్నారు. డజను ప్రమిదలు రూ. 30 నుంచి రూ.60 వరకు అమ్ముతున్నాం. – చింతలపూడి ప్రశాంత్ కుమార్, ఫ్యాన్సీ వ్యాపారి, అమలాపురం



దీపావళి దీపాలు



మట్టి ప్రమిదల తయారీ



అమలాపురంలో వెరైటీ ప్రమిదలను బండి వద్ద కొనుగోలు చేస్తున్న మహిళలు

రత్నగిరి భక్త జనసంద్రం

- సత్యదేవుని దర్శించిన 30 వేల మంది
- స్వామివారి ఆదాయం రూ.25 లక్షలు



స్వామి వారి దర్శనానికి బారులు తీసిన భక్తులు



తిరుచ్చి వాహనంపై స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తున్న భక్తులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. సుమారు 30 వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు. సుమారు 1,800 స్వామివారి వ్రతాలు జరిగాయి. భక్తులు సప్త గోకులంలో గోవులకు ప్రదక్షిణలు చేసి, రావిచెట్టు వద్ద దీపాలు వెలిగించారు. వివిధ విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం సమకూరింది. నాలుగు వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. ఇలాఉండగా, ఆలయ ప్రాకారంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని తిరుచ్చి వాహనంపై ఘనంగా ఊరేగించారు. ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అమ్మవారి ఉత్సవమూర్తులను తిరుచ్చి వాహనంపై ప్రతిష్ఠించి అర్చకులు పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛాటన మధ్య మంగళ వాయిద్యాల నడుమ పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రాగా, మూడు సార్లు ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

తిరుపతిలో పోటెత్తిన భక్తులు

పెద్దాపురం(సామర్లకోట): పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో వేంచేసిన శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి అనేక మంది భక్తులు కాలినడకన చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. సుమారు పది వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్టు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.1,47,150, అన్నదాన విరాళాలుగా రూ.54,035, కేశ ఖండన ద్వారా రూ.4,240, తులాభారం ద్వారా రూ.50, ప్రసాద విక్రయం ద్వారా రూ.16,845, స్వామివారికి కానుకగా రూ.101తో మొత్తం రూ.2,22,421 ఆదాయం వచ్చిందని చెప్పారు. సుమారు 3,500 మంది భక్తులు మధ్యాహ్నం అన్నప్రసాదం స్వీకరించారు,

స్వల్పంగా పెరిగిన పొగాకు ధర

దేవరపల్లి: పొగాకు మార్కెట్ ఒడిదొడుకుల్లో కొనసాగుతోంది. మార్కెట్ నిలకడ లేకపోవడంతో ధర ఎగసి పడుతోంది. రెండు వారాల పాటు మార్కెట్లో పొగాకు ధర కిలో రూ.425 కొనసాగింది. రెండు రోజులుగా ఈ ధర పెరుగుతూ వస్తోంది. శనివారం మార్కెట్లో కిలో గరిష్ఠ ధర రూ.430 పలికింది. 2024–25 పంట కాలంలో పండించిన పొగాకు కొనుగోళ్లను పొగాకు బోర్డు మార్చి 24న ప్రారంభించింది. శనివారం నాటికి 168 రోజులు జరిగిన వేలం ప్రక్రియలో మార్కెట్ అనేక ఒడిదొడుకులను ఎదుర్కొంది. కొనుగోళ్ల ప్రారంభంలో కిలో గరిష్ఠ ధర రూ.290 పలింది. ఈ ధర దాదాపు రెండు నెలలు కొనసాగింది. ఆ సమయంలో చాలా మంది చిన్న రైతులు తమ వద్ద ఉన్న పొగాకును అమ్ముకోగా, పెద్ద రైతులు నిల్వ ఉంచారు. అనంతరం మార్కెట్ అంచెలంచెలుగా నిలదొక్కుకుని, రోజురోజుకూ ధర పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం కిలో గరిష్ఠ ధర రూ.430 పలకడంతో.. ముందుగా అమ్ముకున్న చిన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొనుగోళ్ల ప్రారంభంలో ధర కంటే ప్రస్తుత ధర కిలోకు రూ.140 పెరగడంతో ముందుగా అమ్ముకున్న రైతుల డీలా పడ్డారు. ఈ ఏడాది పొగాకు రైతుల పంట పండిందని చెప్పవచ్చు. గతేడాది కంటే కిలోకు రూ.30 గరిష్ఠ ధర అదనంగా రైతులకు లభించింది. గతేడాది కిలో రూ.410 పలికిన పొగాకు.. ఈ ఏడాది రూ.430 పలుకుతోంది. లో గ్రేడ్ మార్కెట్ ఎగిసిపడుతోంది. మొన్నటి వరకూ కిలో ధర రూ.60 నుంచి రూ.70 పలకగా, ఈ ధర రూ.60 నుంచి రూ.80కి చేరింది. అయినా లో గ్రేడ్ పొగాకు కొనుగోళ్లకు ట్రేడర్లు ఆసక్తి చూపని పరిస్థితి నెలకొంది. రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలో సుమారు 84 మిలియన్ల కిలోల పంట ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేయగా, ఇప్పటి వరకు 74.29 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగాయి. మరో 10 మిలియన్ల కిలోల పంట కొనుగోలు చేయాల్సి ఉంది.

దీపావళి సంతోషంగా సాగాలి

కలెక్టర్ మహేష్ కుమార్



అమలాపురం రూరల్: దీపావళి పండుగను అత్యంత జాగ్రత్త, భద్రతతో సంతోషంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. టపాసులను లైసెన్స్ ఉన్న దుకాణం నుంచి మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. పర్యావరణ హిత దీపావళి అన్ని విధాలా శ్రేయస్కరమని ఆయన తెలిపారు.

విజ్ఞాన కౌశలం

- కౌశల్ క్విజ్ పోటీలకు వేళాయె
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేకం
- సైన్స్‌పై ఆసక్తిని పెంచడమే లక్ష్యం



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు



కౌశల్ క్విజ్ కాంపిటీషన్స్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రముఖులు (ఫైల్)

రాయవరం: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తుంటాయి. వాటిలో భారతీయ విజ్ఞాన మండలి(బీవీఎం), ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి (ఏపీ కాస్ట్) సంయుక్త ఆధ్వర్యంలో ఏటా జరిపే కౌశల్ క్విజ్ పోటీలు ఒకటి. వీటిని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే నిర్వహిస్తారు. పిల్లల్లో సైన్స్ పరిజ్ఞానాన్ని తెలుసుకోవడం, భావి శాస్త్రవేత్తలను తయారు చేయడం ఈ పోటీల ప్రధాన లక్ష్యం. ఇటీవల కౌశల్ సైన్స్ 2025 పరీక్ష నోటిఫికేషన్ విడుదలైంది. విద్యార్థుల వివరాలు పంపించేందుకు ఈ నెల 24 తేదీని గడువుగా నిర్ణయించారు.

వీరందరూ అర్హులే..

అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులందరూ కౌశల్ క్విజ్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులే. సదరు విద్యార్థులు ప్రత్యేకంగా క్విజ్ టీమ్‌గా ఏర్పాటు కావాలి. తొలుత అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సైన్స్ సబ్జెక్టుల టీచర్ల ద్వారా విద్యార్థులను ఎంపిక చేయాలి. తద్వారా ఈ పోటీకి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. 8, 9, 10 తరగతుల్లోని సైన్స్, గణితం సబ్జెక్టులపై కౌశల్ క్విజ్ పోటీ ఉంటుంది. అదే విధంగా ‘విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయుల కృషి’ అనే అంశంపై సేకరించిన మెటీరియల్‌ను విద్యార్థులు అధ్యయనం చేయాలి.

బహుమతులు

విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తారు. నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను ప్రదానం చేస్తారు. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతిగా రూ.7,500, ద్వితీయ బహుమతిగా రూ.6 వేలు, తృతీయ బహుమతిగా రూ.4,500, కన్సొలేషన్ బహుమతుల కింద రూ.3 వేలు అందజేస్తారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్ర స్థాయి పోటీకి పంపిస్తారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.12 వేలు, తృతీయ బహుమతిగా రూ.9 వేలు అందించనున్నారు. రాష్ట్ర స్థాయిలో కన్సొలేషన్ బహుమతులుగా రూ.6 వేల వంతున ఎంపిక చేసిన కొందరికి ప్రదానం చేస్తారు.

ఈ నెల 24 తుది గడువు

ఎంపిక చేసిన విద్యార్థుల వివరాలను పాఠశాలలకో ఆర్డినేటర్లు ఈ నెల 24వ తేదీ లోపు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీవీఎంఏపీ.ఓఆర్‌జీలో రిజిస్ట్రేషన్ చేయాలి. 8వ తరగతి విద్యార్థులకు ‘వికసిత భారత్ కొరకు సుస్థిర మరియు హరిత ఇంధన వనరులు’, 9వ తరగతి విద్యార్థులకు ‘సత్యేంద్రనాథ్ బోస్ జీవితం మరియు ఆయన చేసిన కృషి’ థీమ్‌తో పోస్టర్ కాంపిటీషన్ నిర్వహించనున్నారు. అన్ని ప్రభుత్వ యాజమాన్యాల్లోని 8, 9 తరగతుల నుంచి ఇద్దరు వంతున ఎంపిక చేసిన విద్యార్థులతో పోస్టర్ కాంపిటీషన్ జరుగుతుంది.

పరీక్ష షెడ్యూల్

కౌశల్ సైన్స్ క్విజ్ ప్రాథమిక స్థాయి ఆన్‌లైన్ పరీక్షను నవంబర్ 1న 8వ తరగతికి, 3న తొమ్మిదో తరగతికి, 4న 10వ తరగతికి నిర్వహిస్తారు. జిల్లా స్థాయి పోటీలకు సంబంధించి 8, 9 తరగతులకు నవంబర్ 27న, 10వ తరగతికి 28న జరుగుతుంది. రాష్ట్ర స్థాయి పోటీల తేదీని తర్వాత ప్రకటిస్తారు. రాష్ట్ర స్థాయి విజేతలకు రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నారు. మరిన్ని వివరాలకు జిల్లా కో ఆర్డినేటర్ ఎంఎస్ సూర్యనారాయణ 99086 67536 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

క్విజ్ టీమ్ కోసం పాఠశాల స్థాయిలో 8, 9, 10 తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ప్రాథమిక పరీక్ష నిర్వహిస్తారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల నుంచి కనీసం ఒక్కరు, గరిష్ఠంగా 10 మంది వరకు ఈ ప్రాథమిక పరీక్ష రాయవచ్చు. మొబైల్, ట్యాబ్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ ద్వారా రాయవచ్చు. తరగతిలో టాపర్‌గా నిలిచిన విద్యార్థి పాఠశాల క్విజ్ టీమ్ సభ్యుడిగా ఎంపిక చేయబడతాడు. ఈ మూడు తరగతుల విద్యార్థుల మార్కులను కలిపి పాఠశాల మార్కు నిర్ణయిస్తారు. తరగతి వారీగా పరీక్ష నిర్వహిస్తారు. ఇలా జిల్లాలో మొదటి 36 స్థానాల్లో ఉన్న పాఠశాలలు జిల్లా స్థాయి ఆఫ్‌లైన్ క్విజ్‌కు అర్హత పొందుతాయి.

పోటీతత్వం పెరుగుతుంది



కౌశల్ సైన్స్ క్విజ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనే విధంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి. దీని ద్వారా విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి మరింత పెరుగుతుంది. వారిలో పోటీతత్వం అలవడుతుంది.
– షేక్ సలీం బాషా, డీఈవో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి



జిల్లాకు మంచి పేరు తీసుకు వచ్చేలా ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కౌశల్ క్విజ్ పోటీలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. అధిక సంఖ్యలో రిజిస్ట్రేషన్ చేయించాలి. దీని కోసం విద్యార్థులను సిద్ధం చేయాలి.
– జీవీఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

తపా్వసులు జాగ్రత్త

- కాల్చేటప్పుడు అప్రమత్తత అవసరం
- పిల్లలను ఓ కంట కనిపెట్టాలి
- రేపు దీపావళి పర్వదినం

కొత్తపేట: మతాబులు మమతలు పూయ.. చిచ్చుబుడ్లు కాంతులనీయ.. తారాజువ్వలు గాలిలో ఎగరేయ.. వెన్నముద్దలు వెలుగులనీయ.. అందాల తారలు వాకిట్లో వాలినట్లు టపాసులతో సందడి చేయ.. వెలుగుల పండగను ఆనందాల రవళిలా జరుపుకొందాం. ఈ నెల 20న దీపావళి సందర్భంగా టపాసుల మోతతో ఊరూవాడా దద్దరిల్లనుంది. అయితే వాటిని కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలి. ఎవరికి వారే గ్రహించి అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఏమాత్రం అజాగ్రత్త ఉన్నా పెను ప్రమాదం తప్పదని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా దీపావళి రోజున పాటించాల్సిన జాగ్రత్తలు కొత్త కాకపోయినా మరోసారి గుర్తు చేసుకుంటే చాలా మంచిదని చెబుతున్నారు. టపాసులు కాల్చే చిన్నారులను దగ్గరుండి చూసుకోవాలని, వారి విషయంలో తస్మాత్ జాగ్రత్త అని అంటున్నారు. దీపావళి దగ్గర పడుతున్న కొద్దీ బాణసంచా తయారీలో యాజమాన్యం, సిబ్బంది విశ్రమించకుండా పనిలో నిమగ్నమవుతారు. చిన్నపాటి నిర్లక్ష్యం, అజాగ్రత్త పెను ప్రమాదానికి దారి తీస్తుంది. ఏటా జిల్లాలో ఒకటో, రెండో ప్రమాదాలు జరుగుతున్నాయి.. ప్రాణాలు హరిస్తున్నాయి. ఈ ఏడాది తాజాగా రాయవరంలో భారీ విస్ఫోటం సంభవించి పది మంది, అయినవిల్లి మండలం విలసలో ఇద్దరు మృత్యువాత పడిన ఘటనలను అధికారులు ప్రస్తావిస్తున్నారు. ఇకపై ఏ చిన్న ప్రమాదం జరగకుండా దీపావళిని జరుపుకోవాలని సూచిస్తున్నారు.

పండుగ రోజున ఇలా చేద్దాం..

- గ్రామీణ ప్రాంతాల్లో పంట పొలాలు, గడ్డివాములు, పూరి గుడిసెలు ఉండే ప్రదేశాల్లో రాకెట్లు, చిచ్చుబుడ్లు, తారాజువ్వలు వంటి టపాసులు కాల్చరాదు.
- టపాసుల పనితీరు, వెలిగించాల్సిన విధానం తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలి.
- పిల్లలు పెద్దల పర్యవేక్షణలోనే క్రాకర్స్ కాల్చాలి.
- ఇరుకైన ప్రదేశాలు, వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే చోట టపాసులు కాల్చరాదు.
- బాణసంచా కాల్చేటప్పుడు కాటన్ దుస్తులు మాత్రమే ధరించాలి.

అగ్నిమాపక కేంద్రాల ఫోన్, ఎస్ఎఫ్ఓల ఫోన్ నంబర్లు

అమలాపురం–9963727665– 8856 231101
కొత్తపేట – 9963728051 – 08855 243299
మండపేట – 9963727741–08855 232101
రామచంద్రపురం–9440149394–08857 242401
రాజోలు– 9603727995 – 08862 221101
ముమ్మిడివరం–7989956542–08856271101

పర్యావరణాన్ని పరిరక్షించేలా..

దీపావళి రోజున పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అన్నివర్గాల ప్రజలు చైతన్యవంతులు కావాలి. క్రాకర్స్ ఎంత తక్కువ వినియోగిస్తే వాతావరణ కాలుష్యం అంత తగ్గుతుంది. దీపావళి అంటేనే వెలుగుల పండగ. అందుకే ప్రతి ఒక్కరూ ఇళ్ల ముందు దీపాలు వెలిగించుకుని పండగ జరుపుకోవాలని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు.



కొత్తపేటలో బాణసంచా తయారీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎస్పీ మురళీమోహన్ (ఫైల్)

జిల్లాలో బాణసంచా షాపులు

తయారీ కేంద్రాలు	18
హోల్‌సేల్ షాపులు	15
రిటైల్ షాపులు (తాత్కాలిక లైసెన్స్ షాపులు)	సుమారు 455

వ్యాపారులూ అప్రమత్తత అవసరం

జనసంచారం లేని, ఊరికి దూరంగా ఉండే ప్రాంతాల్లో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలి. అక్కడ ప్రమాదాలు జరగకుండా తగిన అగ్ని ప్రమాద నియంత్రణ సామగ్రి ఉంచుకోవాలి. బాణసంచా అమ్మే చోట ఇసుక, నీరు, కార్బన్ డై ఆక్సైడ్‌ను అందుబాటులో ఉంచాలి. దుకాణాల వద్ద పొగ, మద్యం తాగరాదు. ప్రతి దుకాణానికి మధ్య కనీసం 10 అడుగుల దూరం ఉండేలా చూసుకోవాలి. అలాగే విక్రయ కేంద్రాల వద్ద విద్యుత్ వైరింగ్ సరిగ్గా చూసుకోవాలి. ప్రతి షాపు వద్ద క్రాకర్స్ ధరల పట్టిక, అగ్నిమాపక కార్యాలయం ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచాలి.

అనుమతులు తప్పనిసరి



బాణసంచా తయారీ, హోల్‌సేల్, రిటైల్ విక్రయదారులు కచ్చితంగా నిర్దేశిత అనుమతులు పొందాలి. అక్రమంగా మందుగుండు సామగ్రి కలిగి ఉన్నా, అమ్మకాలు చేపట్టినా చర్యలు తప్పవు. సమస్యలు తలెత్తితే తక్షణమే పోలీసు, సమీపంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయానికి సమాచారం అందించాలి.

–పి.శ్రీకర్, ఆర్డీఓ, కొత్తపేట

చర్యలు తీసుకోవాలి



ఎక్కడైనా అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తాం. ప్రభుత్వ నిబంధనల మేర మాత్రమే క్రాకర్స్ విక్రయాలు చేపట్టాలి. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. ప్రజలు కూడా జాగ్రత్తలు వహించాలి. ఈ దీపావళిని ఆనందంగా జరుపుకోవాలి.

–సుంకర మురళీమోహన్, డీఎస్పీ, కొత్తపేట

వెంటనే సమాచారం అందించాలి

దీపావళి బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పూరిళ్లు, గడ్డివాములు ఉండేచోట వాటిని నీటితో తడపడం, నీటిని సమీపంలో ఉంచుకోవడం మేలు. అలాగే బాణసంచా అమ్మేవారు కూడా అగ్నిమాపక నియంత్రణ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలి. ప్రమాదం జరిగితే తక్షణమే 100, 101కు లేదా సమీపంలో ఫైర్ స్టేషన్, పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి.

–ఎస్.పార్థసారథి, జిల్లా అగ్నిమాపక అధికారి, అమలాపురం

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 22,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	27,000
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 25,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 25,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

చీటీల పేరుతో రూ.కోటికి టోకరా

పోలీసులను ఆశ్రయించిన బాధితులు

పెద్దాపురం (సామర్లకోట): కూలి పని చేసుకొని కొంత సొమ్ము దాచుకోవాలని చీటీలు వేసిన పేద మహిళలకు రూ. కోటి వరకు టోకరా వేసిన సంఘటన ఇది. పెద్దాపురం మండలం జి. రాగంపేటకు చెందిన 80 మంది మహిళలను నమ్మించి గ్రామానికి చెందిన ఒక మహిళ చీటీలు వేయించింది. చీటీలు పాడుకున్న తరువాత సొమ్ము అడిగితే కేసులు పెడతానని బెదిరించడంతో శుక్రవారం మహిళలు పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వసంతకుమార్ (32)



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న సంధ్య

- అతడి భార్యకు తీవ్రగాయాలు
- విజయవాడ నుంచి ఇచ్ఛాపురం వెళ్తుండగా ఘటన

ప్రత్తిపాడు: మండలం ధర్మవరం గ్రామ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయ పడిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం లొద్దిపుట్టి గ్రామానికి చెందిన పిట్టా వసంతకుమార్ (32) విజయవాడలోని ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. తన స్వగ్రామం వెళ్లేందుకు తన భార్య సంధ్యతో కలిసి బైక్‌పై బయలుదేరాడు. అరకు లోయ వెళ్లి, అక్కడి నుంచి స్వగ్రామం వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. జాతీయ రహదారిపై ధర్మవరం గ్రామ సమీపంలో రొయ్యల మేత తీసుకువెళ్తున్న వ్యాన్ మరమ్మతులకు గురికావడంతో నిలిపివేశారు. ఆగి ఉన్న వ్యాన్‌ను వసంతకుమార్ బైక్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సంధ్యను ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ తరలించారు. మృతదేహాన్ని శవపరీక్షకై స్థానిక సీహెచ్‌సీ తరలించారు. ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రిని సాగనంపి.. తనయుడూ ఆ వెనకే..

- అంతిమ సంస్కారం చేసివచ్చి కుప్పకూలిన తనయుడు
- తండ్రి మరణం జీర్ణించుకోలేక మృతి



మృతి చెందిన తండ్రీతనయులు నరసింహమూర్తి, రాజా (ఫైల్)



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు రూరల్: తండ్రి దహన సంస్కారాలు పూర్తి చేసి ఇంటికి వచ్చిన తనయుడు అస్వస్థతకు గురై మృతి చెందిన ఘటన మండలంలోని ఉత్తరకంచిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కందా నరసింహమూర్తి (70) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుమారుడు కందా రాజా (45) తండ్రికి దహన సంస్కారాలు పూర్తి చేసి ఇంటికి చేరుకున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాజా ఆరోగ్యం సహకరించక పోవడానికి తోడు, తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు రాజాను చికిత్స నిమిత్తం ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించినా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయన అంత్యక్రియలను బంధువులు నిర్వహించారు. ఈ ఘటన కుటుంబ సభ్యులతో పాటు స్థానికులను కన్నీరు పెట్టించింది. రాజా పంచాయతీ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. రాజా కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

ఫుడ్ పాయిజన్ మూలాలు తెలుసుకుంటాం

డీఎం హెచ్ఓ దుర్గారావు దొర



ఆస్పత్రిలో రోగుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్ఓ దుర్గారావు దొర

అంబాజీపేట: అంబాజీపేటలో ఫుడ్ పాయిజన్ జరిగి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.దుర్గారావు దొర శనివారం ఉదయం పరామర్శించి బాధితులకు మనోధైర్యం కల్పించారు. ఈ నెల 15వ తేదీన మాచవరానికి చెందిన 22 మంది స్థానిక హోటల్ నుంచి తీసుకువచ్చిన టిఫిన్ తిని అస్వస్థతతకు గురైన విషయం తెలిసిందే. వీరిలో 18 మంది అంబాజీపేట, మరో నలుగురు అమలాపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, వారి ఆరోగ్యం నిలకడగా ఉందని డీఎంహెచ్ఓ పేర్కొన్నారు. ఫుడ్ పాయిజన్‌కు గల కారణాలు పరిశీలిస్తున్నామని, ఇప్పటికే నమూనాలు సేకరించామని, పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపామన్నారు. బాధితులందరికీ మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ వైద్యులకు, ఆస్పత్రి యాజమాన్యానికి ఆదేశించారు. పరామర్శించిన వారిలో తహసీల్దార్ బి.చినబాబు, డిప్యూటీ ఎంపీడీఓ కె.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

శనైశ్చరుని ఆదాయం రూ.12.55 లక్షలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మండలంలోని మందపల్లి ఉమామందేశ్వర (శనైశ్చర) క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. శనికి ప్రీతికరమైన శనివారంతో పాటు త్రయోదశి తిథి (ప్రదోషం) కలసి రావడంతో ప్రతి వారం కంటే ఈ వారం భక్తులు అత్యధికంగా తరలివచ్చారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ దారపురెడ్డి సురేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు పూజా ఏర్పాట్లు చేశారు. ముందుగా ప్రాతఃకాల సమయంలో ఆలయ అర్చకులు, వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. ప్రత్యక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాల టిక్కెట్లు ద్వారా రూ 7,85,700, ఆన్‌లైన్, క్యూఆర్, పరోక్ష పూజా టిక్కెట్ల ద్వారా రూ 3,94,400, అన్న ప్రసాదం విరాళాలు రూపంలో రూ.75,095 మొత్తం దేవస్థానానికి రూ.12,55,195 ఆదాయం వచ్చినట్టు ఈఓ సురేష్‌బాబు తెలిపారు.

భర్త మందలించాడని భార్య ఆత్మహత్య



శిరీష (ఫైల్)

అనపర్తి: భర్త మందలించాడన్న మనస్తాపంతో భార్య మృతి చెందిన ఘటన శనివారం అనపర్తిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నమ్మి శిరీష (30) భర్త సంతోష్‌తో కలసి స్థానిక సింధు టవర్స్‌లో కాపురం ఉంటోంది. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. శనివారం ఉదయం సంతోష్ జండూబాం అడగగా కనిపించక పోవడంతో ఇంట్లో వస్తువులు ఎక్కడ పెట్టావు నీకు తెలియదా అని భార్య శిరీషను మందలించాడని, దీంతో మనస్తాపం చెందిన ఆమె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి చేసుకుని చనిపోయినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు. ధవళేశ్వరంలో ఉంటున్న శిరీష తల్లి లంక అమ్మాజీ తన కుమార్తె చావుకి కారణం భర్త సంతోష్, అత్త, ఆడపడుచు వేధింపులేనని అనుమానం వ్యక్తం చేశారని ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఎల్.శ్రీను నాయక్ తెలిపారు.

కాకినాడలో గోల్డ్‌కప్ హాకీ ఇండియా పోటీలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో కాకినాడలో మొదటి సారిగా గోల్డ్‌కప్ హాకీ ఇండియా చాంపియన్‌షిప్ 2026 పోటీలు జరుగుతాయని క్లబ్ ఫౌండర్ రవిచంద్ర తెలిపారు. ఈ మేరకు పోటీల బ్రోచర్‌ను శనివారం కలెక్టర్ షణ్మోహన్‌కు అందించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 4 నుంచి 14 వరకూ ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో 12 పురుషుల జట్లు, ఆరు మహిళా జట్లు పాల్గొంటాయన్నారు.

హాకీ ఇండియా పోటీల బ్రోచర్‌ను కలెక్టర్‌కు అందజేస్తున్న క్లబ్ సభ్యులు



సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

ADMISSIONS

■ DIPLOMA & ENGINEERING ADMISSIONS Reg. By. All Governments. SRM College Ph: 94401 11487 [P-395]

Real Estate

FLAT FOR SALE

■ కాకినాడ, విద్యుత్ నగర్‌ను చేర్చి రాజేశ్వరినగర్‌లో గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న 2 BHK తూర్పు ఫేసింగ్ ఫ్లాట్స్ అమ్మకం ✆ 81067 06066 [SCA25008122]

HOUSE FOR SALE

■ RJYలో గII 25వేలకే శంభూనగర్ లో G+1 200గ బిల్డింగ్, ధవళేశ్వరం SBI రోడ్ పై G+1 బిల్డింగ్ మొత్తం లేదా 13 లక్షలకే పోర్షన్ అమ్మకం. ✆ : 93979 10977, 95050 44449. 30 లక్షల లోన్ సౌకర్యం. [R-7779]

PLOT FOR SALE

■ కాకినాడ పోర్టు దారిలో 100అ ఎడిబి రోడ్డు మీద 1345 చ.గ. స్థలం అమ్మకం– 9347073899 [WB-23624]

■ రాజమండ్రి 150 గజాలు సౌత్ పేస్ సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వెనుక వైపు సంప్రదించండి. 9440000214 [SCA25008944]

■ కాకినాడ యానాం NH-16 హైవే రోడ్డు చేర్చి జి.వేమవరం G.S. గార్డెన్లో DTCP అప్రూవల్ కలిగిన చుట్టూ మూడు వైపులా రోడ్లు కలిగియున్న 1825 చ॥గ॥ స్థలం అమ్మకం కలదు. ✆ : 96668 63917, 99491 73915 [R-1171]

■ కాకినాడ రూరల్, పిఠాపురం దగ్గర గల చిత్రాడ నుండి చంద్రంపాలెం వెళ్లే రోడ్డు పక్కన ప్లాట్లు మరియు కాకినాడ దగ్గర గల వాకలపూడి శ్రీనివాస్‌నగర్‌లో 300 గజాలు & కాకినాడ ADB రోడ్ దగ్గరలో అచ్చంపేట గ్రామం నుండి గొంతాల మీదుగా సామర్లకోట వెళ్లే రోడ్డులో రోడ్డు పక్కన ప్లాట్లు అమ్మకమునకు కలవు. ఫోన్ : 94921 23355 [V- 2869]

RENT

■ Aquaculture Hatcheries for Lease Bhavani Hatcheries, Kothakondur, Nellore. Ph.No. 8008313044, 9989797864 [HA-16819]

TOLET

■ రాజమండ్రి, లాలాచెరువు, భారత్ పెట్రోల్ బంకు ఎదుటి వీధిలో ఇండివిడ్యువల్ హౌస్ గ్రౌండ్ ఫ్లోర్ 3 BHK +1 & ఫస్ట్ ఫ్లోర్ 3 BHK+1 రెసిడెన్షియల్/ఆఫీస్‌కు అద్దెకు ఇవ్వబడును. 79896 43529 [SCA25009124]

Wanted

■ ప్రముఖ ప్రసిద్ధి గాంచిన MNC లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేయుటకు అడ్వైజర్స్ / లీడర్స్ కావలెను. పార్ట్/ఫుల్ టైమ్, నో టార్గెట్స్ ✆ : 98488 70106 [SCA25009155]

■ కాకినాడ ఇంట్లో ఉండి ఇంటిపని వంటపని చేయుటకు 40 సం॥ల లోపు ఆడ పని మనిషి కావలెను ✆ : 0884-2362015, 93908 07320 [SCA25008708]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ:15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9014885406 [HA-642]

■ హైదరాబాద్ హోంకేర్‌లో ఏజెంట్లకు మంచి అవకాశం మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతి నెల 2 వేల కమీషన్ కలదు వర్కర్ జీ: 18K, ఫ్రీ వసతి ఫుడ్. Ph: 8977547749 [SCA25009055]

■ Wanted Teachers to teach Social, Hindi, Telugu for High School & LKG, UKG English Medium Teachers. marshall High School, Madhavapatnam. ✆ : 91774 13203 [R-101]

■ రామకృష్ణ గ్రూప్ (AP NO-1), VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 73829 73264, 99087 69888 [B-1280518]

■ Sparsh Senior care, Hyderabadలో Caretakers కావలెను, వృద్ధులు & పేషెంట్స్ సంరక్షణకు నమ్మకమైన, అనుభవం కలిగిన మహిళలు కావలెను. వయసు: 25–45Yrs సంప్రదించండి – 7207894411 [HA-16789]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్

నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra

రీజనల్ సెంటర్లు :
రాజమండ్రి : 99516 02906, 90101 20345
రాజానగరం : 97057 54205, అనపర్తి, మండపేట : 99516 02941
రామచంద్రపురం : 99516 02936
కాకినాడ, పిఠాపురం, పెద్దాపురం : 98499 62678
తుని, జగ్గంపేట : 90109 67896, అమలాపురం : 97053 47414
రాజోలు , పి.గన్నవరం : 97053 46456

సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం. ఫోన్స్: 0883-2483010

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

- ఎంపీ ఉదయ్ శ్రీనివాస్
- ఘనంగా ఫెన్సింగ్ పోటీల ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న పాఠశాల డైరెక్టర్ సుగుణారెడ్డి తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ రూరల్ మండలం లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో అండర్–14 బాలబాలికల ఫెన్సింగ్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సబ్ జూనియర్స్ విభాగంలో నిర్వహించే ఈ పోటీల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల పల్లి రామస్వామి, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి హాజరయ్యారు. కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అధ్యక్షత వహించారు. ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా, సుగుణారెడ్డి పోటీలను ప్రారంభించారు. ఎంపీ శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం వల్ల ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు. ఈ పోటీలలో 13 జిల్లాల నుంచి 200 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫెన్సింగ్ సంఘ కార్యదర్శి కృష్ణమోహన్, మాజీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపాల్ బ్రొహ్మ పాల్గొన్నారు.

వైభవంగా సుదర్శన హోమం

అమలాపురం టౌన్: వేంకటేశ్వరస్వామికి ప్రీతిపాత్రమైన శనివారం రోజున ద్వాదశి కలిసి రావడంతో భక్తులు అమలాపురం స్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ద్వాదశి సందర్భంగా సుదర్శన హోమం వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ కంచిపల్లి అబ్బులు, ఈవో సత్యకుమార్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

వాడవాడలా వేంకటేశునామమే..



గౌతమీ నదీ తీరాన సాగుతున్న శ్రీవారి చక్రస్నానం



భక్తులతో కిక్కిరిసిన పరంధాముని క్షేత్రం



వాడపల్లి క్షేత్రంలో పండిత సత్కారం

- కనీ.. వినీ.. అనీ తరలించిన భక్తజనం
- కోకొల్లలుగా కోనేటిరాయని దర్శనం
- చక్రస్నానంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

కొత్తపేట: అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవ యజ్ఞం శనివారం ఘనంగా ముగిసింది. చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగింది. రాత్రి జరిగిన ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. దేవదాయ – ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఈ నెల పదో తేదీ నుంచి ప్రారంభమైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు తిరుమలలో జరిగే వేడుకలను తలపించాయి. ఆలయ ప్రాంగణం, మాడ వీధులను పుష్పాలంకరణలతో, క్షేత్రం అంతటా విద్యుద్దీపాలతో అలంకరించారు. నిత్యం పూజలు, అభిషేకాలు, శ్రీవారి అలంకరణలు, వాహన సేవలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా సాగాయి. రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఉత్సవాలను తిలకించారు. ఆఖరి రోజు ఈఓ చక్రధరరావు పర్యవేక్షణలో వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవర ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్, అర్చక బృందం ఉదయం నుంచి స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మహా శాంతి హోమం, మహా పూర్ణాహుతి, ధ్వజారోహణం, నీరాజన మంత్రపుష్పాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా చక్రస్నానం

ఉత్సవాల ముగింపునకు సూచికగా గౌతమీ నదీ తీరంలో వేలమంది భక్తుల గోవింద నామ స్మరణల నడుమ అవభృతస్నానాన్ని (చక్రస్నానం) దేవస్థానం అధికారులు, అర్చకులు, వేద పండితులు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం వివిధ పూజలతో పాటు మహాదాశీర్వచనం, ఏకాంతసేవ నిర్వహించారు. స్వామిని దర్శించిన భక్తులు తన్మయులయ్యారు.

యథాతథంగా ఆర్జిత సేవలు

శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో రద్దు చేసిన ఆర్జిత సేవలైన అష్టోత్తర పూజలు, శ్రీవేంకటేశ్వర సహిత ఐశ్వర్యలక్ష్మీ హోమాలు, నిత్య కల్యాణోత్సవాలు ఆది వారం నుంచి పునరుద్ధరిస్తున్నట్టు ఈఓ తెలిపారు.

విజయవంతంగా బ్రహ్మోత్సవాలు

ఈ సందర్భంగా డీసీ అండ్ ఈఓ చక్రధరరావు మాట్లాడుతూ వాడపల్లి క్షేత్రంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా జరిగాయని అన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఎంతో సంతృప్తి చెందారన్నారు. బ్రహ్మోత్సవాలకు సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, అర్చకులు, గ్రామస్తులు, మీడియా ప్రతినిధులు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.